ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
శనివారం 8 జూన్ 2024

మంత్రి నాగేంద్ర రాజీనామా ఆమోదం



బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటూ మంత్రి నాగేంద్ర చేసిన రాజీనామాకు ఆమోదం పలికారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గురువారం రాత్రి రాజీనామా లేఖను సమర్పించారు. సదరు లేఖను శుక్రవారం రాజ్‌భవన్‌కు పంపారు. సాయంత్రం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆమోదం తెలిపారు.

పరిషత్‌లో చెరిసగం





కలబురగిలో ఈశాన్య పట్టభద్రుల ఓట్ల లెక్కిస్తున్న సిబ్బంది

● మూడు స్థానాల్లో కాంగ్రెస్.. మూడు చోట్ల కూటమి విజయం

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠభరితంగా సాగిన ఆరు విధాన పరిషత్ స్థానాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడు చోట్ల, బీజేపీ-జేడీఎస్ కూటమి మూడు చోట్ల విజయం సాధించాయి. బెంగళూరు, మైసూరు, కలబురగిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది. గురువారం ఉదయం ప్రారంభమైన లెక్కింపు రాత్రి పొద్దుపోయేదాకా సాగింది. కాంగ్రెస్ అభ్యర్థులు బెంగళూరు పట్టభద్రుల స్థానం నుంచి రామోజిగౌడ, ఆగ్నేయ ఉపాధ్యాయ స్థానం నుంచి శ్రీనివాస్ గెలుపొందారు. ఈశాన్య పట్టభద్రుల స్థానం నుంచి చంద్రశేఖర్ పాటిల్ రెండోసారి విజయం సాధించారు. పట్టభద్రుల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఆర్. దేవెగౌడ 24,888 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి రామోజిగౌడ 36,729 ఓట్లు సాధించారు. 80,080 ఓట్లు పోల్ కాగా 6 రౌండ్ల కౌంటింగ్ జరిగింది. తొలి ప్రాధాన్యత ఓట్ల పరంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు నమోదు చేశారు. ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ 8,909 ఓట్లతో విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి ఓడిపోయారు. 24,106 ఓట్లు పోల్ కాగా 7 రౌండ్లలో లెక్కింపు జరిగింది. తొలి ప్రాధాన్యత ఓట్లకు అనుగుణంగా 704 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. దక్షిణ ఉపాధ్యాయ, నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి మైసూరులోని మహారాణి కళాశాలలో ఓట్ల లెక్కింపు జరిగింది. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి వివేకానంద విజయం సాధించగా నైరుతి ఉపాధ్యాయ స్థానం నుంచి బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి భోజేగౌడ గెలుపొందారు. నైరుతి పట్టభద్రుల స్థానంలో బీజేపీ అభ్యర్థి ధనంజయ్ సర్జి గెలుపొందారు. దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థి వివేకానంద 10,382 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి మరితిబ్బేగౌడ 6,201 ఓట్లు పొందారు. 4,622 ఓట్ల తేడాతో వివేకానంద విజయం సాధించారు. నాలుగు సార్లు ఇదే స్థానం నుంచి గెలుపొందిన మరితిబ్బేగౌడ ఓటమి చెందారు. నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి జేడీఎస్ - బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తొలి ప్రాధాన్యత ఓట్లతో విజయం నమోదు చేసి రెండోసారి ఎమ్మెల్సీ అయ్యారు. భోజేగౌడ 9,829 ఓట్లు పొందగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కేకే మంజునాథ్ 4,562 ఓట్లు పొందారు. భోజేగౌడ 5,267 ఓట్ల తేడాతో విజయం సాధించారు. నైరుతి పట్టభద్రుల నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కలబురగిలో జరిగింది. బీజేపీ - జేడీఎస్ అభ్యర్థి డాక్టర్ ధనంజయ్ సర్జి కాంగ్రెస్ అభ్యర్థిపై భారీ మెజారిటీ సాధించారు. సర్జికి 37627 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి ఆయనూరు మంజునాథ్‌కు 13516 ఓట్లు వచ్చాయి. బీజేపీ రెబెల్ అభ్యర్థి రఘుపతిభట్ కేవలం 7,039 ఓట్లు సాధించారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసిన ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గ విజేత శ్రీనివాస్



బెంగళూరు పట్టభద్రుల విజేత రామోజిగౌడ



నైరుతి పట్టభద్రుల విజేత డాక్టర్ ధనంజయ్ సర్జి



ఆగ్నేయ ఉపాధ్యాయ విజేత చంద్రశేఖర్ పాటిల్



మైసూరులో భోజేగౌడ, వివేకానందను అభినందిస్తున్న కార్యకర్తలు

బెంగళూరు గ్రామీణలో ఓటమికి బాధ్యత నాదే

● ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ నియోజకవర్గం ఓటమికి వ్యక్తిగతంగా తనదే బాధ్యత అని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. నగరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు గ్రామీణ నుంచి తన తమ్ముడు డీకే సురేశ్ ఓటమికి తన వ్యక్తిగత బాధ్యతగా భావిస్తున్నా అన్నారు. ఓటమి నుంచి కోలుకోవాల్సి ఉందన్నారు. ఓడినంత మాత్రాన మౌనంగా ఉండేది లేదన్నారు. కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు ఒక్కటవుతాయని భావించా అన్నారు. మైనారిటీల ఓట్లు మినహా బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల ఓట్లన్నీ వస్తాయని భావించామన్నారు. ఈ స్థాయిలో ఫలితం ఉంటుందని ఊహించలేదన్నారు. చెన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో డీకే సురేశ్ పోటీ చేసే విషయం ఇంకా ప్రస్తావనకు రాలేదన్నారు. ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుంటున్నామని పేర్కొన్నారు. ఓడిపోయామని ఇంట్లో కూర్చునేది లేదని, తనను నమ్మిన కార్యకర్తలు, ప్రజలకు శక్తిని నింపేలా పనిచేస్తా అన్నారు. కార్యకర్తల రక్షణకు ఏం చేయాలో పరిశీలిస్తామన్నారు. ఎంతోమంది పెద్దనాయకులే ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. 14 స్థానాల్లో విజయం సాధిస్తామని భావించామన్నారు. ఒక్కస్థానం నుంచి 9 స్థానాలకు పెరిగామన్నారు. ఇంకా ఎక్కువ స్థానాలు లక్ష్యంగా ఉన్నా సాధ్యం కాలేదన్నారు. తన నియోజకవర్గ పరిధిలో డాక్టర్ సీఎన్ మంజునాథ్ గెలుపొందారని, వ్యక్తిగతంగా అభినందిస్తున్నా అన్నారు. పార్టీ కంటే అక్కడ వ్యక్తి గెలిచారని పేర్కొన్నారు. ఇంత తేడా ఊహించలేదన్నారు. డీకే సురేశ్ బాగా పనిచేశారని, ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్నారు. డాక్టర్ మంజునాథ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని గెలిపించారని పేర్కొన్నారు. కనకపురలో 60వేల మెజారిటీ వస్తుందని భావించామని కానీ సాధ్యం కాలేదన్నారు. ఫలితాల ద్వారా ప్రజలు ఇచ్చిన సందేశాన్ని అంగీకరిస్తానని తెలిపారు.

ఓటమికి ఇన్‌చార్జిలే బాధ్యులు

● ఇక ప్రజల మధ్యే మెలగండి ● కొత్త ఎంపీలకు రాహుల్ సూచన

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి రాహుల్‌గాంధీ బెంగళూరులో పర్యటించారు. కోర్టు కేసులో స్వయంగా హాజరు కావాల్సి రావడంతో శుక్రవారం నగరానికి వచ్చారు. ఇదే సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో లోక్‌సభకు ఎన్నికైన కొత్త ఎంపీలతోపాటు ఓటమి చెందిన అభ్యర్థులతో రాహుల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాహుల్ మాట్లాడింది కాసేపే అయినా అగ్రనేతలకు వణుకు పుట్టించేలా మారింది. ఎన్నికల్లో ఓటమికి ఇన్‌చార్జి మంత్రులను బాధ్యులను చేయాలని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. గెలుపొందిన ఎంపీలు, ఓడిన అభ్యర్థులు ఏ కారణం చేతనూ నియోజకవర్గాలు వీడరాదని సూచించారు. ఢిల్లీ, బెంగళూరులో ఎక్కువ కాలం గడపకుండా ప్రజల మధ్యే ఉండాలని సూచించారు. ఓడినవారు శక్తివంతులు కావాలని, గెలిచినవారు రాష్ట్రానికి సంబంధించి ధ్వనిగా మారాలని సూచించారు. రాష్ట్రానికి పన్నుల్లో జరిగిన అన్యాయం, కళసాబండూరి, మేకెదాటు ప్రాజెక్టులపై ప్రశ్నించాలన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు గ్రాంటు రాలేదని, రాష్ట్రానికి జరుగుతున్న నిర్లక్ష్యంపై లోక్‌సభలో గట్టిగా ప్రశ్నించాలని రాహుల్ సూచించారు. ఇదే సందర్భంగా ఓటమి చెందిన అభ్యర్థులతో రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా మాట్లాడారు. ఏఏ నియోజకవర్గాల్లో ఎలా పోలింగ్ జరిగింది, మీ ఓటమికి గల కారణాలు తెలుసుకున్నారా అని అడిగారు. మంత్రుల నియోజకవర్గంలోనే మెజార్టీ తగ్గిందనే అంశంపై చర్చిస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీ ఈ అంశంపై నివేదిక కోరినట్టు సమాచారం. కేపీసీసీలో సమావేశం ముగించుకుని రాహుల్‌గాంధీ ఓ హోటల్‌కు వెళ్లారు. అక్కడ సీఎం, డీసీఎంతోపాటు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో చర్చలు జరిపారు. అనంతరం డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ చట్టానికి గౌరవం ఇవ్వాలనే రాహుల్‌గాంధీ కోర్టుకు వచ్చారని పేర్కొన్నారు. సీఎం పోస్టుకు రూ. 2,500 కోట్లు ఫిక్స్ అయ్యిందనే ప్రకటనపై కేసు ఉందన్నారు. ప్రకటనలో రాహుల్‌గాంధీ పాత్ర లేదని, కేవలం ద్వేషంతోనే ఇలా చేశారన్నారు. ప్రస్తుతానికి ఎన్నికల్లో ఓటమికి మంత్రులను బాధ్యులు చేసే అంశంపై నిర్ణయం తీసుకోలేదన్నారు. అధిష్ఠానందే తుది నిర్ణయమన్నారు. అయితే రాహుల్ పర్యటన తర్వాత మంత్రులలో గుబులు పట్టుకుంది.



కేపీసీసీ సమావేశంలో రాహుల్‌గాంధీ

సినిమాలకు గుడ్‌బై

● ఇక పూర్తిగా రాజకీయాలకే ● నిఖిల్ కుమారస్వామి



బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇకపై సినిమాలకు గుడ్‌బై చెబుతున్నానని, పూర్తి స్థాయిలో రాజకీయాలకే పరిమితం అవుతానని జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి తెలిపారు. మండ్యలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక సినిమాలు చేయదలచుకోలేదని అన్నారు. పూర్తిగా రాజకీయాల్లోనే ఉంటానని తెలిపారు. కుమారస్వామిపై మండ్య ప్రజలు చూపిన గౌరవం, ప్రేమ అభిమానాలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని బలోపేతం చేయాలన్నది కుమారస్వామి ఆశయమన్నారు. దూరదృష్టి ఉన్నందునే బీజేపీతో కలసి ముందుకెళ్లామని పేర్కొన్నారు. కాంగ్రెస్ విమర్శలకు మండ్య ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. కుమారస్వామి కేంద్రంలో మంత్రి పదవి కోరేది ఉండదని, కానీ సీనియారిటీ ప్రకారం అవకాశం దక్కుతుందన్నారు. ఇకపై పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రమంతా తిరుగుతా అన్నారు. రాష్ట్రానికి కుమారస్వామి రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన సేవలు అపారమన్నారు. అన్నివర్గాల ప్రజలు కుమారస్వామికి ఆశీస్సులు అందించారని తెలిపారు.

భవానిపై చర్యలు వద్దు

● హైకోర్టు సూచన
● వెనువెంటనే సిట్ ముందు హాజరు



బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్‌కు చెందిన ప్రజ్వల్ రాసలీలల వివాదం తర్వాత బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసులో భవాని రేవణ్ణకు ఊరట లభించింది. దర్యాప్తు చేసిన సిట్ అధికారులు మూడుసార్లు నోటీసులు జారీ చేయడంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా శుక్రవారం భవానికి ఊరట కలిగించేలా హైకోర్టు ధర్మాసనం ప్రస్తుతానికి ఎటువంటి చర్యలు వద్దని సూచించింది. అరెస్టు భయం నుంచి బయటపడిన భవాని రేవణ్ణ హైకోర్టు ఆదేశాలు వచ్చిన వెంటనే న్యాయవాదులతో కలసి సిట్ ముందు హాజరయ్యారు. విచారణాధికారుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ వివాదంతో తనకు సంబంధం లేదని, తాను ఎవరినీ భేటీ కాలేదని, తన కుమారుడు ప్రజ్వల్‌పై కొందరు కుట్ర పన్నారని ఆమె చెప్పినట్టు తెలిసింది.

'హమారె బారా' సినిమా విడుదలకు బ్రేక్

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముస్లింలను అవమానించేలా ఉందనే కారణంతో బాలీవుడ్‌కు చెందిన అన్ను కపూర్ నటించిన 'హమారె బారా' సినిమాను రెండువారాలపాటు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసింది. రెండు వారాలు లేదా తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు సినిమా విడుదల చేయరాదని స్పష్టం చేసింది. వివిధ జిల్లాలు, తాలూకాల ముస్లిం సంఘాలు సినిమాను విడుదల చేయరాదని డిమాండ్ చేసిన మేరకు ప్రభుత్వం స్పందించింది. ట్రైలర్‌లోనే ముస్లిం మతాన్ని రెచ్చగొట్టేలా హేళన చేసేలా ఉందని సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. ఇటువంటి సినిమాలకు అవకాశమిస్తే మతాల మధ్య ద్వేషం పెరుగుతుందని శాంతిభద్రతలకు భంగం కలగుతుందని, ముస్లిం మత భావాలు దెబ్బతీస్తాయని సంఘాలు తెలిపాయి. సదరు సినిమా శుక్రవారం దేశవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉండేది. రెండు రోజుల కిందటే ముంబై హైకోర్టులో పిటీషన్ దాఖలైంది. సెన్సార్ సర్టిఫికెట్ ఉన్నా సినిమా విడుదలకు అభ్యంతరం తెలపడాన్ని నిర్మాతలు బీరేంద్రభగత్, రవి ఎస్ గుప్త విచారం వ్యక్తం చేశారు.

రెబెల్స్‌కు భంగపాటు



ఈశ్వరప్ప




వినయ్ కుమార్

● శివమొగ్గలో ఈశ్వరప్ప, దావణగెరెలో విజయ్‌కుమార్‌కు డిపాజిట్ల గల్లంతు

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదని స్వతంత్రులుగా బరిలోకి దిగిన రెబెల్స్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు. శివమొగ్గ, దావణగెరెలో బీజేపీ, కాంగ్రెస్ రెబెల్స్ వీరంగం చేసినా వారు ఓట్లను సాధించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. పార్టీ కోసం పనిచేశామని మమ్మల్ని కాదంటే సత్తా చూపుతామని స్వతంత్రులుగా గెలిచి మళ్లీ పార్టీలో చేరుతామనే ప్రగల్భాలు మట్టికరిచాయి. శివమొగ్గలో బీజేపీ రెబెల్ అభ్యర్థిగా మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప, దావణగెరెలో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థిగా వినయ్‌కుమార్ రెబెల్‌గా పోటీ చేశారు. రెండు చోట్ల రాజకీయంగా అనుభవంతోపాటు సుదీర్ఘకాలంగా ఎన్నో కీలక పదవులు అనుభవించిన నాలుగు కుటుంబీకులకు చెందినవారే అభ్యర్థులు కావడంతో రెబెల్స్ మట్టికరిచారు. శివమొగ్గలో ఈశ్వరప్ప సత్తా ఏమిటో అనేది తేలిపోయింది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా మూడుసార్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావవంతమైన నేతగా పేరొందారు. నాలుగుసార్లు మంత్రిగా, ఒకసారి డీసీఎంగాను కొనసాగారు. అంతటి అనుభవం ఉన్న నేత రెబెల్‌గా మారడం పార్టీలో తీవ్ర విమర్శలకు కారణమైంది. 2023 శాసనసభ ఎన్నికల్లో పలువురు సీనియర్లకు టిక్కెట్‌లు ఇవ్వరాదని అధిష్ఠానం నిర్ణయించింది. ఇందులో ఈశ్వరప్ప కూడా ఉన్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని ఆయన అంగీకరించారు. లోక్‌సభ ఎన్నికల్లో హావేరి నుంచి కుమారుడు కాంతరాజ్‌ను అభ్యర్థి చేయాలని భావించారు. సమీక్షల ప్రకారం కాంతరాజ్‌కు టిక్కెట్ సరికాదని తప్పించారు. జీర్ణించుకోలేని ఈశ్వరప్ప రెబెల్‌గా మారారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. యడియూరప్ప కుట్రతోనే టిక్కెట్ రాలేదని ఆరోపించారు. బీవై రాఘవేంద్రను ఓడిస్తానని సవాల్ చేశారు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి విజయేంద్రను తప్పించడమే లక్ష్యమన్నారు. ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. శివమొగ్గలో బీజేపీ అభ్యర్థి రాఘవేంద్రకు 7,78,721 (56.5శాతం) ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కు 5,35,006 (38.8శాతం) ఓట్లు దక్కగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఈశ్వరప్పకు 30,050 (2.25శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. దావణగెరెలో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించిన జీబీ వినయ్‌కుమార్ పరిస్థితి ఘోరంగానే ముగిసింది. ఇన్‌సైట్ అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ అయిన జీబీ వినయ్‌కుమార్ కొంతకాలంగా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఈ నియోజకవర్గం సీనియర్ నేత శ్యామనూరు శివశంకరప్ప కుటుంబీకులకు అనుకూలంగా ఉందని సర్వేలు తేల్చడంతో మంత్రి మల్లికార్జున భార్య డాక్టర్ ప్రభాకు టిక్కెట్ ఇచ్చారు. ఇదే స్థానం నుంచి బీజేపీ తరపున కేంద్రమాజీ మంత్రి, సిట్టింగ్ ఎంపీ సిద్దేశ్వర్ భార్య గాయత్రిని నిలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రభా మల్లికార్జున్‌కు 6,33,059 ఓట్లు (47.9శాతం), బీజేపీ అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్‌కు 6,06,965 (46శాతం) ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి వినయ్‌కుమార్‌కు 42,907 ఓట్లు (3.2శాతం) వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాతీర్పు పార్టీల అభ్యర్థులకే కానీ రెబెల్స్‌గా రంగంలోకి దిగితే ఏం సాధించలేరని సంకేతాలు ఇచ్చినట్టయ్యింది.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.57	1,581.09
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,190	297
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	06	247
సామర్థ్యం (టీఎంసీలు)	3.82	5.02

సండూరు తాలుకాలో భారీ వర్షం

తోరణగల్లు, జూన్ 7 : సండూరు తాలుకాలోని కొన్ని ప్రాంతాలలో భారీ వర్షపాతం నమోదైంది. సండూరు తాలుకాలోని చోర్నూరు ఓబళిలో 51 మిల్లీమీటర్లు, విఠలాపురం ప్రాంతంలో 37.2 మిల్లీమీటర్లు వర్షం పడింది. అలాగే విఠలాపురం గ్రామంలోని చాకలి ఈరన్న, దుర్గమ్మ ఇళ్లు దెబ్బతిన్నాయి. అలాగే విఠలాపురం పరిధిలోని తుమ్మటి గ్రామం దగ్గర ఉన్న చిన్న చెరువు అడ్డుకట్ట తెగిపోయింది.

నిరసనకు ముందుకొచ్చిన మహిళలు



కుడితినిలో న్యాయం కోసం నిరసనలో పాల్గొన్న మహిళలు

కంప్లి, జూన్ 7 : కుడితినిలో భూములు పోగొట్టుకున్న రైతన్నలు దీక్షలు చేయడం ప్రారంభించి సుమారు 537 రోజులు అవుతున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో చివరకు ఆ కుటుంబాల్లోని మహిళలు న్యాయం కోసం శుక్రవారం నిరసనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణుకమ్మ, మీనాక్షి, వన్నమ్మ, తదితరులు మాట్లాడుతూ 13 సంవత్సరాల క్రితమే కుడితిని, జానెకుంటి, అరిగిణదోణి, ఎర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణివీరాపురంలలో కర్మాగారాలు ఏర్పడుతాయని చెప్పడంతో తాము భూములు పరిశ్రమల కోసం ఇచ్చామన్నారు. అప్పట్లో భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు పరిశ్రమలు రాలేదని, ఉద్యోగాలు కల్పించలేదన్నారు. దీంతో న్యాయం కోసం నిరసనలకు దిగామన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు జంగ్లిసాబ్, తిప్పేస్వామి, సత్యప్ప, లక్ష్మీ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న లైబ్రరీ అధికారి జగదీష్

సిరుగుప్ప, జూన్ 7 : మొక్కలు నాటడం వలన ఎక్కువగా వర్షాలు పడేందుకు అవకాశం వుందని సిరుగుప్ప తాలుకా లైబ్రరీ అధికారి జగదీష్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లైబ్రరీ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమ తమ ఇళ్ల ముందు, పొలాల్లో మొక్కలు నాటి పరిసరాలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా సిరుగుప్ప పట్టణ న్యాయవాది వెంకటేష్‌నాయక్, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, సమాజ సేవకులు పాల్గొన్నారు.

దీక్షతో దేన్నయినా సాధించవచ్చు



నీట్ పాసైన విద్యార్థినికి స్వీట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

కంప్లి, జూన్ 7 : విద్యార్థులకు పట్టుదల, దీక్ష వుంటే ఎంత ఎత్తుకైనా ఎదుగుతారని విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. నీట్ పరీక్షలో జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది కుమార్తె ఉత్తీర్ణత సాధించడంతో ఆయన ఆ విద్యార్థిని ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న సమాజంలో ప్రతి ఒక్కరికి విద్య అవసరమని, విద్య లేకపోతే సమాజంలో దేన్నీ సాధించలేమన్నారు. ప్రతి ఒక్కరు పిల్లలకు విద్య నేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటి విద్యార్థులే రేపటి పౌరులన్నారు. విద్యతో పాటు దేశ సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చదువుల్లో క్రమ శిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

కుండపోత





దుర్గమ్మగుడి అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీటిలో ఆగిపోయిన బస్సు. సెకండ్ గేట్ వద్ద పాదచారుల అవస్థలు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- ఆగిపోయిన రాకపోకలతో నగరవాసుల ఇక్కట్లు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

బళ్లారిరూరల్, జూన్ 7 : బళ్లారిలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో మధ్యాహ్నం రెండు గంటలపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ఆ నీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. వాహనదారులు, గృహిణులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బళ్లారినగరంలో ఓపిడి ఆస్పత్రి, విద్యానగర్, కంటోన్మెంట్, సుధా క్రాస్, దుర్గమ్మగుడి అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు నిలబడడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్గమ్మగుడి అండర్ బ్రిడ్జి వద్ద నీరు అధికంగా చేరుకోవడంతో ఒక బస్సు, ఆటో మధ్యలో నిలిచిపోయాయి. అదేవిధంగా ఓపీడీకి వెళ్లే రహదారిలో రెండవ గేట్ వద్ద కూడా వర్షపునీటి మడుగు ఏర్పడింది. నగరంలో లోతట్టు ప్రాంతాలైన హనుమాన్ నగర్, హుస్సేన్ నగర్‌తో పాటు పలు వార్డుల్లో వర్షపునీరు అధికంగా ఇళ్లలోకి చేరింది. కాలనీ ఇళ్లలోకి నీరు చేరడంతో గృహిణులు నానాఅవస్థ పడ్డారు.

ఈ వర్షం కారణంగా గాంధీనగర్ పోలీస్ స్టేషన్ వద్ద చెట్లు విరిగిపడి కరెంటు తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య కూడా నెలకొంది.

జలదిగ్బంధంలో సిరుగుప్ప

సిరుగుప్ప, జూన్ 7 : భారీ వర్షాల కారణంగా శుక్రవారం సిరుగుప్ప పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకుంది. రోడ్లు జలమయమయ్యాయి. వికలాంగుల చేతన కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షాల పట్ల ఓ వైపు రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా, నగరసభ అధికారులు మాత్రం రోడ్లన్నీ జలమయమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడు మాత్రం డ్రైనేజీలు క్లీన్ చేస్తున్నా, మిగతా రోజుల్లో వాటిని పట్టించుకోకపోవడంతో మురికివాడలు జలమయమవుతున్నాయి. ఇకనైనా నగరసభ అధికారులు నీరు మళ్లించే ప్రయత్నాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఓపీడీ వద్ద వర్షంలో జనం ఇబ్బందులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

బళ్లారి, సిరుగుప్ప, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈశాన్య కర్ణాటక విభాగం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ విజయం సాధించారు. కలబురగిలో గురువారం ఓట్ల లెక్కింపు ప్రారంభించగా శుక్రవారం మధ్యాహ్నం ఫలితాలను అధికారులు వెల్లడించారు.

బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్‌కు 35,050 తొలిప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్‌కు 39,496 ఓట్లు పడ్డాయి, స్వతంత్ర అభ్యర్థి ఎన్. ప్రతాప్‌రెడ్డికి 17.421 ఓట్లు పోల్ అయ్యాయి. 12,513 ఓట్లు చెల్లలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. రెండవ ప్రాధాన్యత కింద కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ విజయం సాధించారు. ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల విభాగంలో మొత్తం 7 జిల్లాలు ఉన్నాయి. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, కలబురగి, యాదగిరి జిల్లాల్లో మొత్తం 1,56.623 ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 57.483 మంది ఉండగా, పురుషులు 99,121 మంది, ఇతరులు 19మంది ఉన్నారు. వీరిలో 1,09,031 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండవ ప్రాధాన్యత కింద కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్ 4,651 ఓట్ల అధిక్యతతో విజయం సాధించారని ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.



కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్‌కు డిక్లరేషన్ ఫారం అందిస్తున్న అధికారి

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కురుగోడులో ప్రకృతి వైపరీత్యాల నివారణ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

కంప్లి, జూన్ 7 : గత కొన్ని రోజుల నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో కొన్నిచోట్ల ఇళ్లుకూలాయి. కొన్ని చోట్ల పంపుసెట్ల కింద పండించిన పంటలు నష్టపోయారు. ముందుజాగ్రత్త చర్యగా రెవెన్యూ శాఖ, ప్రకృతి వైపరీత్యాల నివారణ శాఖ కురుగోడు పట్టణంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. కురుగోడు తాలుకాలో ఎక్కడ నష్టం వాటిల్లినా 08393 200014 నెంబర్‌కు సంప్రదించి అక్కడ జరిగిన సంఘటనను తెలియజేయాలని అధికారులు కోరారు. ఇకపై పగలు, రాత్రి తేడా లేకుండా కంట్రోల్ రూములో సిబ్బందిని నియమించామన్నారు. ఈ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏ నష్టం జరిగినా తెలియజేయాలని కోరారు.

ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలి

- తోరణగల్లులో తొలి రక్తదాన యూనిట్ ప్రారంభం: డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, జూన్ 7: 18ఏళ్లు నిండిన ఆరోగ్యవంతులందరూ తప్పకుండా రక్తదానం చేయాలని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు సూచించారు. జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో తోరణగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో తొలి రక్త సేకరణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సండూరు తాలూకా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రుల్లో రక్తసేకరణ యూనిట్లు ఉన్నాయని, వాటిని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు కూడా విస్తరించేందుకు ఇక్కడ రక్త సేకరణ విబాగాన్ని ప్రారంభించామన్నారు. దాతల నుంచి సేకరించిన రక్తాన్ని విమ్స్ బ్లడ్ బ్యాంక్ ద్వారా బ్లడ్ గ్రూప్‌ల ప్రకారం సేకరించి భద్రపరుస్తామన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకొని రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి రక్తదానం చేసేందుకు సహకరించాలని కోరారు. గర్భిణులు సర్జికల్ డెలివరి సమయంలో, ఎమర్జెన్సీ సర్జరీల సమయంలో క్యాన్సర్ పేషెంట్లకు రక్తదానం చేయడానికి ఈ రక్తం ఉపయోగపడుతుందన్నారు.

సండూరు తాలూకా నోడల్ అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని, రక్తానికి ప్రత్యామ్నాయంలేదని మరొకరి నుంచి రక్తదానం ద్వారానే రక్తం లభిస్తుందన్నారు. 18నుంచి 60ఏళ్లలోపు ఆరోగ్యవంతమైన పురుషులు, మహిళలు రక్తదానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సంచార రక్తదాన విభాగం ద్వారా ఉచిత స్వీయ చైతన్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 79సార్లు రక్తదానం చేసిన ఎస్‌కే.సింగ్ 80వసారి రక్తదానం చేశారు, ఈసందర్భంగా సండూర్ తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ భరత్ , గోపాలరావు, ప్రసూతి వైద్యుడు రాజయ్య, పిల్లల వైద్యుడు డాక్టర్ మణికుమార్, ఈశ్వర్ దాసప్పనవర్, శివరాము, బసవరాజ్, మంజునాథ్, వెంకటేశ్‌నాయక్, ప్రశాంత్, సయ్యద్ అన్సారీ, మాల లక్ష్మి, రూప, హులిగెమ్మ, గర్భిణులు పాల్గొన్నారు.



80 వసారి రక్తదానం చేస్తున్న ఎస్‌కే.సింగ్

ఎన్‌ఆర్‌సీ నీట్ అకాడమీలో విద్యార్థుల ప్రతిభ



లీలా, రమాకాంత్, ప్రిన్స్‌కుమార్, మేఘన, రైనిష్‌కుమార్, నిహార్, ముకీమ్, రవితేజ, ఇందిరా, రవిశంకర్

బళ్లారి సిటీ, జూన్ 7: నగరలోని ఎన్‌ఆర్‌సీ నీట్ అకాడమీలో విద్యార్థులు పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారని అకాడమీ అధ్యక్షులు రమణ చౌదరి, ఎస్‌జిటీ శిక్షణ సంస్థ అధ్యక్షులు రుద్రప్ప తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తమ అకాడమీలో విద్యార్థులు నీట్ పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారన్నారు. కుమారి లీలా 720మార్కులకు గాను 676 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇతర ఏడుగురు విద్యార్థులు 600కిపైబడి మార్కులు సాధించగా, ముగ్గురు విద్యార్థులు 550కి పైబడి మార్కులు సాధించారన్నారు. రమాకాంత్ 649, మేఘన 648, రైనిష్ కుమార్ 629, నిహార్ 614, మాక్సీమ్ 601, రవితేజ 556. రవిశంకర్ 554, నిధిర 553, మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను అలకానందదేవి, రాజశేఖర్, శ్రీనివాస్, రంగారెడ్డి, నాగరాజు, కేలేజ్ ప్రిన్సిపాల్ తిప్పేరుద్ర, మంజుళ తదితరులు అభినందించారు.

బీసీ అధికారి ఆత్మహత్యాయత్నం



కంబారా(ఫైల్)

రాయచూరు, జూన్ 7: ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక లింగసుగూరులో పని చేస్తున్న అక్షర దాసోహ అధికారి మౌనేష్ కంబారా(45) సుమారు 40 నిద్రమాత్రలు తిని ఆత్మహత్యకు యత్నించిన ఘటన గురువారం రాత్రి జిల్లాలోని లింగసుగూరులో చోటుచేసుకుంది. మౌనేష్ కంబారా లింగసుగూరులోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన ఒక సంవత్సరం క్రితం లింగసుగూరులో అక్షర దాసోహ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. పనితో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ విధులు నిర్వహించే వాడు. ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక తన ఇంట్లోనే నిద్రమాత్రలు తిని ఆత్మహత్యకు యత్నించగా వెంటనే ఆయనను లింగసుగూరులో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆయనకు మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన వశిష్ట విద్యార్థులు



ప్రమోద్, కార్తీక్, పనీశ్‌సాయిగౌడ, విక్రమ్‌సూర్య, శరత్‌రెడ్డి, హరిశ్రేయాస్, వేణుగోపాల్, శ్రేయరెడ్డి, హసీనా, వర్షా



శ్రేయజోషి, అలీసాకుమారి, బిందు, పల్లవి, సంజనా, సాయిదేవహర్షిణి

బళ్లారి సిటీ, జూన్ 7: 2024 నీట్ అఖిల భారత వైద్యకీయ పరీక్షా ఫలితాల్లో వశిష్ట కాలేజ్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. గత నాలుగు సంవత్సరాల నుండి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు ఈసంవత్సరం కూడా అత్యుత్తమ ర్యాంకులతో కాలేజ్ కీర్తిని పెంచారు.

డి.ప్రమోద్,720మార్కులకు గాను 661, పనీశ్‌సాయిగౌడ 653, విక్రమ్ సూర్య 640, కార్తీక్ 636, వేణుగోపాలస్వామి, 625, హరి శ్రేయాస్ 624, శ్రేయారెడ్డి యలాపుర 624, హసీనా 621, శ్రేయాజోషి 618, అలీశా కుమారి ప్రియా 618, పల్లవి 614, సంజనా 612, బిందు 608.సామిదేవ హర్షిని 603, శరత్‌రెడ్డి 603మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి అభినందించారు. పాలక మండలి, కాలేజ్ సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.

హోసూరు జోన్

నీట్‌లో టాపర్‌గా అద్వైత్ ఇంటర్నేషనల్ అకాడమీ విద్యార్థిని



నీట్ పరీక్షల్లో టాపర్‌ను సత్కరిస్తున్న అద్వైత్ ప్రిన్సిపాల్

హోసూరు జూన్ 7: కృష్ణగిరి జిల్లాలోని హోసూరు అద్వైత్ ఇంటర్నేషనల్ అకాడమీ పాఠశాల విద్యార్థిని బి.దీపిక, నీట్ 2024 పరీక్షల్లో 720 మార్కులకుగాను 700 మార్కులు సాధించింది. దీంతో పాఠశాలయాజమాన్యం స్వీట్లు పంచిపెట్టి, పుష్పగుచ్చాలు అందించి ఆమెను సత్కరించింది. అద్వైత్ ఇంటర్నేషనల్ అకాడమీ పాఠశాల ప్రిన్సిపాల్ అశ్వత్ నారాయణ, పాఠశాల డైరెక్టర్ బాను ప్రకాశ్, విద్యార్థినిని ప్రిన్సిపాల్ సంగీత రాయ్, డిప్యూటీ ప్రిన్సిపాల్ భవాని, ఆకాష్ నీట్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ కర్ణాటక అధ్యక్షుడు రవికాంత్, హోసూరు బ్రాంచ్ మేనేజర్ తౌసీఫ్ రజాఖాన్, పాఠశాల ఉపాధ్యాయులు, ఆకాశ్ నీట్ కోచింగ్ ఇన్‌స్పెక్టర్ ఆమెను అభినందించారు.

పశువులకు వ్యాక్సినేషన్ ప్రారంభం

హోసూరు(కృష్ణగిరి), జూన్ 7: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పశువులకు టీకా కార్యక్రమంపై ఈనెల 10న ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నేషనల్ లైవ్‌స్టాక్ డిసీజ్ ప్రివెన్షన్ ప్రోగ్రామ్ క్రింద మిజీల్ టీకా ఈనెల 6న ప్రారంభమై 30 రోజుల పాటు కొనసాగుతుంది. అంతేగాక శిబిరం నిర్వహించే గ్రామాల్లోని పశువుల పెంపకందారులకు ఈ శిబిరంపై అవగాహన కల్పించాలని, టీకాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై కమ్యూనికేషన్ విభాగం అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో హోసూరు జిల్లా అటవీ అధికారిణి కార్తీకేయని, జిల్లా రెవెన్యూ అధికారి సాధనకురళ్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, దేవదాయ శాఖ కమిషనర్, సి.బాబు, కృష్ణగిరి మున్సిపల్ కమీషనర్, స్టాన్లీబాబు తదితరులు పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సుందర వడివేల్, కృష్ణగిరి తమిళనాడు వెటర్నరీ సైన్స్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జోనల్ జాయింట్ డైరెక్టర్ ఇళంగోవన్, అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపాలిటీస్, పంచాయతీలు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, వైద్యులు, శాఖాధికారులు పాల్గొన్నారు

గ్రూప్ పరీక్షలు రాసే వారికి మౌలిక సదుపాయాలు

హోసూరు(కృష్ణగిరి), జూన్ 7: కృష్ణగిరి జిల్లాలో ఈనెల 9న తమిళనాడు ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమీషన్ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు సంబంధించి కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వంలో శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కృష్ణగిరిలోని 44 పరీక్షా కేంద్రాల్లో 14,230 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు సంబంధించిన అన్ని పనులను పర్యవేక్షించేందుకు అన్ని సర్కిళ్లలో డిప్యూటీ కలెక్టర్‌ను నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్లు, సౌకర్యాలు కల్పించాలని అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వెళ్లేలా రవాణాశాఖ తరపున తగిన బస్సు సదుపాయాలు కల్పించాలని శాఖాధికారులను ఆదేశించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో, జిల్లా రెవిన్యూ అధికారి సాధనకురళ్, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్ప సెలక్షన్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ జామ్

హోసూరు, జూన్ 7: హోసూరులోని ఏన్నిసోలై, నేతాజీసాలై, వట్టాట్సీయార్ రోడ్డు, బాగలూరు రోడ్డు వంటి పలు ప్రధాన రహదారులపై శుక్రవారం ట్రాఫిక్‌జామ్ నెలకొంది. పగటిపూట గూడ్స్ వాహనాలను రోడ్లపైకి తీసుకొచ్చి సరుకులను రోడ్లపైనే డంపింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. దీంతో అత్యవసర పనులకు వెళ్లేవారు సమయానికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా పాదచారులు కూడా నడవలేని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరారు.



ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ఆగిపోయిన దృశ్యం

ఘనంగా ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు



పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే గణేష్‌కు కేక్ తినిపిస్తున్న పంపాపతి

కంప్లి, జూన్ 7 : కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ కురుగోడు పట్టణంలో శుక్రవారం పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కార్యకర్తల ప్రేమానురాగాలు ఉన్నంతవరకు తాము ఎల్లప్పుడూ అండగానే వుంటామన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా తమ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ బసవరాజు పాటిల్ గెలుపొందారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, సేవలు గుర్తించే ప్రజలు ఈశాన్య క్షేత్రం నుంచి తమ అభ్యర్థి చంద్రశేఖర్ బసవరాజు పాటిల్‌కు గెలుపునిచ్చారన్నారు. రానున్న కాలంలో కంప్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. రానున్న టీపీ, జెడ్పీ ఎన్నికల్లో కూడా బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు సిద్ధంగా వుండాలని, ఏ అభ్యర్థికి టికెట్ లభించినా సంతృప్తిపడకుండా వారి గెలుపు కోసం పాటుపడాలని సూచించారు. ఎల్లప్పుడూ తమ హయాంలో సేవలు చేస్తూ వుంటామని తెలిపారు. బాణసంచా కాల్చి ప్రత్యేక పూజలు జరిపారు.

బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌ను ఢీకొన్న లారీ

రాయచూరు, జూన్ 7 : అతి వేగంగా వస్తున్న లారీ ఒకటి బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌ను ఢీ కొట్టడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జైన ఘటన శుక్రవారం జిల్లాలోని సిరవార తాలూకా కుర్డి క్రాస్ వద్ద జరిగింది. అదృష్టవశాత్తు లారీ డ్రైవర్, లారీ క్లీనర్‌లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లారీ సింధనూరు నుంచి రాయచూరుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన లారీ బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌ను ఢీ కొట్టడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. దీంతో లారీ నుంచి టైర్లు ఎగిరిపోయాయి. సిరవార పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

వేదాంతం రాఘవయ్య (జయంతి)



వేదాంతం రాఘవయ్య 1919 జూన్ 8న కృష్ణా జిల్లా కూచిపూడిలో జన్మించారు. సినీ కొరియోగ్రాఫర్, నటుడు, కూచిపూడి కళాకారుడు, నృత్య దర్శకుడు, సంగీతకారుడు, దర్శక, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు, తమిళ భాషలలో నాటక, సినీ రంగానికి ఎన్నో సేవలందించారు. 'భారతకళా ప్రపూర్ణ' పురస్కార గ్రహీత. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ తొలి జనరల్ కౌన్సిల్‌లోనూ, జాతీయ నృత్యోత్సవానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. వినోద్ పిక్చర్స్‌కు సహ భాగస్వామ్యం కలిగారు. రైతుబిడ్డ, స్వర్గసీమ సినిమాలకు కొరియోగ్రఫీ అందించారు. దేవదాసు, అన్నదాత, అనార్కలి, చిరంజీవులు, సువర్ణ సుందరి తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. 1971లో కన్నుమూశారు.

కేఎన్ కేసరి (వర్ధంతి)



ఆయుర్వేద వైద్యులుగా చిరపరిచితులైన డాక్టర్ కేఎన్ కేసరి 1875 ఏప్రిల్ 26న ప్రకాశం జిల్లా ఇనమన మెళ్ళూరు గ్రామంలో జన్మించారు. అసలు పేరు కోట నరసింహం. 'కేసరి కుటీరం' అనే ఔషధశాల స్థాపకుడు. కర్ణాటక సంగీత విద్వాంసుడు, గాయకుడైన 'ఉన్ని కృష్ణన్' ఆయన మునిమనమడు. 1928లో 'గృహలక్ష్మి' అనే తెలుగు వారపత్రికను స్థాపించి వ్యవస్థాపక సంపాదకుడిగా మహిళా రచయితలను ప్రోత్సహించారు. 'గృహలక్ష్మి స్వర్ణకంకణం' పురస్కారాన్ని స్థాపించారు. 'కేసరి విద్యాసంస్థ' స్థాపించగా నేటికీ అనేక పాఠశాలలను సంస్థ నిర్వహిస్తోంది. 1953 జూన్ 8న కన్నుమూశారు.

స్వామి పార్థసారథి (పుట్టినరోజు)



'కార్పొరేట్ గురు'గా చిరపరిచితులైన ఆవుల పార్థసారథి 1927 జూన్ 8న చెన్నైలో జన్మించారు. స్వామిజీగా పేరొందారు. తత్వవేత్త, వేదాంతాలపై పట్టు కలిగిన వారు. లండన్ యూనివర్శిటీలో పీజీ చేసిన ఆయన ఆరు దశాబ్దాలకుపైగా తత్వ బోధనలు చేస్తున్నారు. 1988లో వేదాంత అకాడమీని నెలకొల్పి వేద అధ్యయన కోర్సులు నిర్వహిస్తున్నారు. అనువాదం చేయడమే కాక 12 పుస్తకాలు రచించారు. ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ సదస్సులలో ప్రసంగిస్తున్నారు. అంతేకాక బుల్లితెరపై కూడా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

మాడుగుల నాగఫణిశర్మ (పుట్టినరోజు)



మాడుగుల నాగఫణిశర్మ అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా పుట్లూరు మండలం కడవకొల్లు గ్రామంలో 1959 జూన్ 8న జన్మించారు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, న్యూఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శిక్షాశాస్త్రి, తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పొందారు. సంస్కృత ఉపన్యాసకులుగా, టీటీడీ ధర్మప్రచార పరిషత్తు అదనపు కార్యదర్శిగా పనిచేశారు. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజపేయి, మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ సమక్షంలో అవధానం నిర్వహించి ప్రశంసలు పొందారు. శతావధాని సామ్రాట్, సహస్రావధాని, బృహత్ ద్విసహస్రావధాని, సహస్రఫణి, శతావధాన చూడామణి తదితర బిరుదులు, స్వర్ణకంకణం, గండపెండేరం పొందారు. పలుచోట్ల కనకాభిషేకాలు పొందారు.

వరుణ మిత్రులతో జలచైతన్యం

» 9 వేల మంది పేర్ల నమోదు

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా భవిష్యత్తులో నీటిని సుస్థిరం చేసేందుకు పలు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. జలమండలి వర్షపునీటిని సద్వినియోగం చేస్తున్న ప్రయత్నానికి ఆదరణ లభిస్తోంది. వర్షపునీటిని నిల్వ ఉంచుకుని వాటిని ఉపయోగించుకోవడం, చెరువులలోకి నీరు చేరేందుకు అవసరమైన సౌలభ్యాలు మెరుగు పరచడంతోపాటు ఇంకుడుగుంతలు అన్ని ప్రాంతాల్లోనూ ఏర్పాటుచేయడం వంటి అంశాలపై వరుణ మిత్రుల ద్వారా చైతన్యం తీసుకురాదలిచారు. ఇటీవల ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ దాకా నగరంలోని పలు ప్రాంతాలలో తలెత్తిన నీటి ఎద్దడి భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే ప్రజాచైతన్యం ముఖ్యమని భావించారు. నీటి సంరక్షణపై చైతన్యం తీసుకొచ్చేలా స్వచ్ఛందంగా పనిచేసేందుకు ముందుకు రావాలని జలమండలి పిలుపునకు భారీ స్పందన వచ్చింది. ఇప్పటికే వరుణమిత్రులుగా పనిచేసేందుకు 9వేల మంది రిజిస్టర్ చేయించుకున్నారు. వీరు వర్షపునీటి సంరక్షణ పద్దతులను ప్రాంతాల వారీ చైతన్యం కల్పించనున్నారు. వర్షపునీటిని భూమిలోకి ఇంకించేందుకు ఇప్పటికే వెయ్యికిపైగా ఇంకుడుగుంతలను జల మండలి ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ధార్మికకేంద్రాలతోపాటు ప్రభుత్వ స్థలాల్లో మరో వెయ్యికిపైగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయదలిచారు. వరుణమిత్రులుగా పేర్లు నమోదు చేసుకున్నవారికి జలమండలి ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా వెయ్యిమందికి వర్షపునీటి సంరక్షణపై ప్రయోగాత్మకంగా శిక్షణలు ఇస్తారు. తర్వాత వారు సబ్ డివిజన్ల వారీగా ప్రజలోల్ల చైతన్యం తీసుకొచ్చి అనుకూలం ఉన్న ప్రతి ఇళ్లు, వాణిజ్య సముదాయాలనుంచి వర్షపునీటి సేకరణకు చైతన్యం తీసుకురానున్నారు. జలమండలినుంచి వీరెవ్వరికీ ఎలాంటి వేతనాలు ఇవ్వరు. ఇంటి యజమానుల నుంచి ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చుతోపాటు అదనంగా కొంతమొత్తం సేకరించేందుకు వెసలుబాటు కల్పించారు. వీరు ప్లంబర్ల తరహాలో పనిచేయనున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా 2600కుపైగా భవనాలకు స్వచ్ఛందంగా వర్షపునీటి ప్రక్రియను ఏర్పాటు చేసుకున్నారు. మరింత చైతన్యం కలిగిస్తే ఎక్కువమంది ముందుకు వస్తారని భావించారు. వర్షపునీటిని సద్వినియోగం చేసుకునేలా నిల్వ ఉంచే విధానం అమలు చేస్తే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై ఒత్తిడి తగ్గుతుంది. సదరు నీటిని తిరిగి వాడుకోవడంతోపాటు భూగర్భజలం పెరిగేందుకు కారణమవుతుంది. జల మండలి చట్టం 2009 సెక్షన్ ఎ ప్రకారం అన్ని భవనాలు, 1200 చదరపు అడుగుల విస్తీర్ణం ఆపై భవనాలకు వర్షపునీటి విధానం తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో నోటీసులు ఇచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకు రాదలిచారు. ఇందుకోసమే వరుణమిత్రులు నగర వ్యాప్తంగా పని చేయనున్నారు. జలమండలి ఛైర్మన్ రాంప్రసాద్ మనోహర్ అభిప్రాయం ప్రకారం వెయ్యిమంది వరుణమిత్రులకు



శిక్షణలు ఇస్తామన్నారు. వీరికి జలమండలి నుంచి ఎటువంటి వేతనాలు ఇవ్వమని నగరంలో వీరు వర్షపునీటి సంరక్షణలో నిపుణులుగా పనిచేస్తారన్నారు.

దేశానికి గౌరవం తెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దండి

శిడ్లఘట్ట, జూన్ 7: పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత ఈ దేశ గొప్ప సంపద అని వారిని దేశానికి కీర్తిప్రతిష్ఠలు, గౌరవం తెచ్చేలా తీర్చిదిద్దాలని తాలూకా కార్మిక అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన బాలకార్మిక వ్యతిరేక చట్టాలపై జాగృతిలో పాల్గొని ప్రసంగించారు. 18ఏళ్లలోపు వారిచే పనులలో చేర్చుకోరాదని చట్టప్రకారం నేరమన్నారు. పిల్లలను తమ శక్తికొద్దీ చదివించి ప్రయోజకులు చేయాలన్నారు. తాలూకాలో బాల కార్మికుల గురించి నిరంతరం తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. గుర్తిస్తే పనుల్లో చేర్చుకున్నవారికి 6 నెలలనుంచి రెండేళ్లవరకు జైలు శిక్షతోపాటు రూ.20వేలు నుంచి 50వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ఎక్కడైనా బాలకార్మికులు ఉన్నట్టు గుర్తిస్తే వారిని రక్షించి పునరావాసం కల్పించి చదివిచేలా తాలూకాలో నెలరోజులపాటు ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ఇలా పట్టణంలోని ఒక గ్యారేజ్‌లో పనిచేస్తున్న కిశోర్ అనే బాలుడిని రక్షించినట్టు తెలిపారు. బాల్యాన్ని కాపాడాలనే అభియానకు సంబంధించినన అధికారి మహ్మద్ రియాజ్, బాలకార్మిక సొసైటీ యోజనె డైరెక్టర్ రమేశ్, విద్యాశాఖ బీఆర్‌సీ కోఆర్డినేటర్ త్యాగరాజు, పెద్దసంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కార్మికశాఖ అధికారి విజయలక్ష్మి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



బాగేపల్లి, జూన్ 7: బాగేపల్లి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలలో చిక్కబళ్ళాపుర వ్యవ సాయశాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినవారికి నోటీసులు జారీ చేశారు. చిక్కబళ్ళాపుర వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రమోద్‌బాబు, బాగేపల్లి సహాయక వ్యవసాయ అధికారి లక్ష్మీ నేతృత్వంలో మూడు విజిలెన్స్ బృందాలు దాడులు చేశారు. కొంతమంది ఎరువులను గోడౌన్‌లో నిల్వ ఉన్నా లేవని నిర్లక్ష్యంగా చెప్పడంపై దుకాణ యజమానులను హెచ్చరించారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రమోద్‌బాబుమాఅట్లాడుతూ పాయింట్ ఆఫ్ సేల్‌లో నమోదుకు, భౌతికంగా ఉన్న నిల్వలకు తేడా ఉన్నట్టు గుర్తించారు. ధరల పట్టిక ప్రదర్శించలేదన్నారు. ఇలా నిబంధనలు ఉల్లంఘించినవారికి నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. అలాగే కొనసాగితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. దాడులలో బాగేపల్లి వ్యవసాయశాఖ సిబ్బంది శంకరయ్య, తాలూకా వ్యవసాయ పరికరాల విక్రయ సంఘం అధ్యక్షులు అశ్వత్థనారాయణ రెడ్డి, కార్యదర్శి చంద్రారెడ్డి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న వ్యవసాయ విజిలెన్స్ అధికారులు

కాంగ్రెస్ విజయోత్సవం

బంగారపేట, జూన్ 7: పరిషత్‌కు సంబంధించి ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్ గెలుపొందడంపై వచ్చే ఎన్నికల విజయానికి దిక్సూచిగా ఉందని బూదికోట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో కార్యకర్తలతో కలసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపినవారికి ధన్యవాదాలు తెలిపారు. విజయోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పార్థసారథి, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ గోవిందరాజు, షంషుద్దీన్ బాబు, వెంకటేశ్, గోవింద, సుహేల్, కుంబారపాళ్య మంజునాథ్, ప్రశాంత్, హెచ్‌కే నారాయణస్వామి, నంజప్ప, శాంతినగర్ కిట్టప్ప తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

కాలువలలో పూడికతీత పనులు

చింతామణి, జూన్ 7: పట్టణానికి అనుబంధంగా ఉండే అంబాజిదుర్గ కొండ, కాదు మల్లేశ్వర గుట్టల ప్రాంతాలనుంచి వచ్చే నీరు రాజకాలువకు సజావుగా చేరేలా ఉన్న కాలువలలో పూడికతీత పనులకు నగరసభ చేపట్టింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో వర్షపునీరు సజావుగా కాలువలలో ప్రవహించకపోవడం, అంజని లే అవుట్‌లోని ప్రధాన రహదారిపై నీరు నిలవడం, ఇళ్లల్లోకి వర్షపునీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రుతుపవనాలు ఆరంభం కావడంతో అన్ని పురసభ, నగరసభల పరిధిలోని రాజకాలువ, అనుబంధ కాలువలలో పూడిక తీసే పనులు చేపట్టారు. నగరసభ పంప్‌హౌస్ పక్కన ఉండే రోడ్డు నుంచి ఫిల్టర్‌బెడ్ సర్కిల్ వరకు రెండు కాలువలలో పేరుకున్న చెత్తాచెదారం తొలగించారు.



కాలువలలో తొలగించిన చెత్తాచెదారం

లోతట్టు ప్రాంతాలు జలమయం

బంగారపేట, జూన్ 7: పట్టణంలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సేట్ కాంపౌండ్, మునియమ్మ లే అవుట్, బస్టాండ్ ప్రాంతాలలో పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. నిద్రలేని రాత్రి గడపాల్సి వచ్చింది. ఇళ్లలోకి చేరిన నీటిని బయటకు పంపేందుకు ప్రజలు నానా తంటాలు పడ్డారు. కాగా సమాచారం అందుకున్న తహసీల్దార్ రశ్మి, పురసభ ముఖ్యాధికారి మీనాక్షిలు స్పందించి సహాయక చర్యలకు సిద్ధమయ్యారు. మురుగు కాలువలు పూర్తిస్థాయిలో స్వచ్ఛపరచకపోవడంతో వర్షపునీరు చేరి పొంగి పొర్లింది. మరోవైపు రెండుమూడు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. లోతట్టు ప్రాంతాల వాసులను స్థానిక ప్రముఖుడు కే చంద్రారెడ్డి నేతృత్వంలో అక్కచ్చమ్మ కల్యాణమండపానికి తరలించారు. శుక్రవారం మురుగుకాలువలలో పేరుకున్న చెత్తా చెదారాన్ని పొక్లైనర్‌తో తొలగించా సమస్యను పరిష్కరించారు.



జలమయమైన ప్రదేశం ఇలా...

హావేరిలో 4వేల మందికి విందు

» మోదీ మూడోసారి ప్రధాని అవుతున్న సందర్భంగా..

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా ప్రకటించడంపై హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా హలగేరిలో మోదీ క్యాంటీన్ యజమాని వీరేశ్‌ఉజ్జన గౌడ నేతృత్వంలో శుక్రవారం 4వేలమందికి భోజనం కల్పించారు. అలాగే ప్రమాణ స్వీకారం రోజు 9న కూడా ఉచితంగా ఓళిగ భోజనం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. కాగా 2019లో మోదీ ప్రమాణస్వీకారం చేసినప్పుడు వేలాదిమందికి భోజనం ఏర్పాటు చేశామని అదే తరహాలోనే హ్యాట్రిక్‌గా నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే రోజున పంపిణీ చేయదలిచామన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

చేళూరు, జూన్ 7: తాలూకా కేంద్రమైన చేళూరులో వార పుసంతలో కూరగాయల ధరలు పెరిగాయి. నాలుగైదురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం జరిగిన వారపు సంతలో కూరగాయల ధరలు సాధారణం కంటే ఎక్కువగానే పలికాయి. పచ్చిమిరప కిలో రూ.120, బీన్స్ కిలో రూ.200, బెండ రూ.50-60, బీరకాయలు రూ.50, టమోటా రూ.30-35, వంకాయ రూ.70-80, కిలో మునక్కాయలు కట్ట రూ.50 వరకు ధరలు ఉన్నాయి. అలాగే సీజన్‌లో లభించే అల్లనేరేడుపండ్లు కిలో రూ.100-120 పలికాయి. ధరలు పెరగడంతో వ్యాపారం ఆశించిన మేరకు లేదని పలువురు వ్యాపారస్తులు వాపోయారు.

శనైశ్వరస్వామికి విశేష పూజలు

శిడ్లఘట్ట, జూన్ 7: పట్టణంలోని గాయత్రినగర్‌లో కొలువైన శనైశ్వరస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామివారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, వసంతోత్సవం, తిరుమంజనం, త్రిశూలస్నాన, కళశాభిషేకం, సాయంత్రం ధ్వజారోహణ, అనంతరం పుష్పయాగం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదబ్రహ్మ వీఎస్ రామ్‌మోహన్‌శాస్త్రి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రోడ్డును బాగు చేయండి



కంకరతేలిన రోడ్డు ఇలా...

చేళూరు, జూన్ 7: చేళూరు తాలూకాలోని సోమనాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని రాచువారుపల్లె నుంచి బెస్తలపల్లె వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతింది. రెండేళ్లుగా ఈ మార్గం కంకరతేలి ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నరేగా పథకం ద్వారా రోడ్డును బాగు చేస్తే స్థానికులకు కూడా ఉపాధి లభించినట్టు అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

రూ.7 కోట్లకు ఎసరు..?

నగరపాలికలో హడావుడిగా బిల్లులు

అనంతపురం క్రైం, జూన్ 7: అనంత నగరపాలికలో హడావుడిగా రూ.7 కోట్ల బిల్లు చేసుకునేందుకు ప్రయత్నించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో బిల్లులు ఆగిపోతాయనే భయంతో గుట్టుగా వ్యవహారం నడపాలని ప్రయత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కానీ ఉన్నతాధికారులకు తెలియడంతో బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలంలో కొన్ని అడ్డగోలు పనులకు సైతం బిల్లులు చేశారు. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలకు సైతం రూ.10లక్షల చొప్పున బిల్లులు పెట్టారు. కొన్ని పనులను సగం పూర్తి చేసి వదిలేశారు. కొన్నింటిని నాసిరకంగా చేశారు. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. టీడీపీ కూటమి అధికారం చేపట్టనుంది. దీంతో నగరపాలికలోని కొందరు కాంట్రాక్టర్లు, నాయకులు తమ బిల్లులను పాస్ చేయించుకోవాలని చూస్తున్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడు చెక్కులు ఇచ్చే పరిస్థితులు లేవు. ప్రతి బిల్లూ సీఎఫ్‌ఎంఎస్‌లోకి వెళ్లాల్సిందే. దీంతో తమకు అనుకూలంగా ఉన్న ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో ఆ బిల్లుల ఫైల్స్‌ను పైకి పంపేందుకు ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులకు దృష్టికి వెళ్లడంతో తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది.

రైతుల సంక్షేమం కోసం పనిచేయండి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూన్ 7: కరువు జిల్లాగా పేరున్న అనంతలో రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు, పంటలు, విత్తన సరఫరా గురించి తెలుసుకున్నారు. వేరుశనగ విత్తనాన్ని అడిగిన ప్రతి రైతుకూ అందించాలని సూచించారు. పచ్చిరొట్ట, అంతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాకు అవసరమైన విత్తనాల వివరాలను వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లి తెప్పించుకోవాలని అన్నారు. అంతర పంటల సరళిని అధ్యయనం చేయాలని, లాభదాయకమైన పంటలను సాగుచేసేలా రైతులలకు సూచనలు ఇవ్వాలని సూచించారు. రైతులకు కొత్త అంశాలపై అవగాహన పెంచడానికి శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కె-6తోపాటు గుజరాత్ గిరినార్-4, 5 రకాల వేరుశనగ సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. సమావేశంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, రేకులకుంట, కదిరి శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

వానలే.. వానలు



అనంతపురంలో వర్షం

అనంతపురం అర్బన్/బొమ్మనహాళ్/డి.హీరేహాళ్, జూన్ 7: నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. అనంతపురం, వజ్రకరూరు మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. శింగనమల, రాప్తాడు, గార్లదిన్నె, పామిడి, నార్పల, పుట్లూరు, కూడేరు, బొమ్మనహాళ్, బెళుగుప్ప మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. యాడికిలో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 23 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా గుమ్మఘట్టలో 89.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 51.2, యల్లనూరు 45.8, రాయదుర్గం 45.6, కంబదూరు 43.4, రాప్తాడు 24.6, బెళుగుప్ప 24.2, బొమ్మనహాళ్, ఆత్మకూరు 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 18.0 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.

- బొమ్మనహాళ్ మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. పత్తి పంట కుళ్లిపోతోంది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండటంతో కొళగానహళ్లి వద్ద కబ్బాలి వంక, ఉద్దేహాళ్ వద్ద వేదవతి హగరి నది పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణాపురం, రంగాపురం క్యాంప్, కళ్లుదేవనహళ్లి, సింగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాల పరిధిలో పత్తి, సజ్జ పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో పత్తి మొక్కలు ఎర్రగా మారి కుళ్లిపోతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- కళ్లుదేవనహళ్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండేళ్ల క్రితం వరదకి రోడ్డు కుంగిపోయి, ఎనిమిది గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మరమ్మతు పనులకు రూ.1.20 కోట్లు వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. వైసీపీ నాయకులు రాళ్లు, మట్టి, పైపులు వేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో అంతటితో ఆపేశారు. మరోసారి అదే ప్రాంతంలో రోడ్డు కుంగిపోయింది.
- కర్ణాటకలోని గవిసిద్ధేశ్వరం కొండ ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. కర్ణాటకలో వర్షాలు, స్థానికంగా కురిసిన వర్షాలకు డి.హీరేహాళ్ మండలంలో వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బళ్లారి-రాయదుర్గం రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. హిర్దేహాళ్ సమీపంలో హైవే పక్కన ఉన్న ఎల్లమ్మవంక, పులకుర్తి సమీపంలోని కానుక వంక, సోమలాపురం గంగమ్మ వంకకు వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు మూడుగంటల పాటు వాగులకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ల పొడవున నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాలు జరుగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబరాన్నంటిన సంబరాలు

చిలమత్తూరు, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. దేమకేతేపల్లి అంజినప్ప, బేకరీ గంగాధర్, శ్రీదేవి, బయపరెడ్డి, బాలాజీ, తిప్పారెడ్డి, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథరెడ్డి, గౌరీశంకర్, మీసేవ సూరి, గంగాధర్, వెంకటసుబ్బయ్య, రామప్ప, శివ పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు..!

హిందూపురం అర్బన్, జూన్ 7: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక రోజు అంటే మరమ్మతులు ఉంటాయిలే అనుకోవచ్చు, వారం రోజులుగా ఉదయం నిద్ర నుంచి లేవకముందు నుంచే కరెంటు కోతలు ప్రారంభమౌతాయి. 10 నుంచి 15 సార్లు కరెంటు పోవడం కొంత సమయం తరువాత రావడం పరిపాటిగా మారింది. ఈ సమయంలో కరెంటు పోతుందని తెలిపితే కరెంటు ఉన్న సమయంలో పనులు చేసుకుంటామని అంటున్నారు. అలా కాకుండా ఎడా పెడా కోతలు విధిస్తుంటే ఇబ్బందిగా మారిందన్నారు. వారానికి ఒక రోజు మెయింటెనెన్స్ అంటూ ఉదయం నుంచి సాయంత్రం దాకా కరెంటు తీసేస్తున్నారు. దీనికి తోడు మరమ్మతులు పేరుతో విద్యుత్‌ను తీసేస్తున్నారు. సంబంధిత అధికారులను అడిగితే విద్యుత్ తీగలపై ఉడతలు సంచరించడం, పాములు, బల్లులు ట్రాన్స్‌ఫార్మర్‌లలోకి దూరడం వంటివి జరగడంతో సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. ఇప్పుడు అవి కూడా జరుగలేదు. మరి ఎందుకు విద్యుత్ తరచూ పోతూ వస్తోందని ప్రశ్నిసే ట్రిప్ అవుతా ఉందని, వర్షాల కారణంగా విద్యుత్ ఆలస్యం అవుతోందని సమాధానమిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం: భూపతి, డీఈఈ,హిందూపురం

ఎండలు ఎక్కువగా ఉండటంతో ఇన్సులేటర్లు నెర్రలు బారాయి. వర్షాలు రావడంతో ఎర్రలు బారిన ఇన్సులేటర్లలో నీరు పోవడంతో అవి పగలి పోతున్నాయి. దగ్గరా వెళ్లి గమనించినా అవి కనపడవు. వర్షాకాలం కావడంతో ఇబ్బందుల ఎదురవుతున్నారు. ప్రస్తుతం పట్టణ ఫీడర్ నుంచి విద్యుత్ అందిస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. అలా తీసుకోవాలంటే రైల్వేట్రాక్ క్రాస్ చేయాల్సి ఉంది. రైల్వే అధికారులు అనుమతి కోసం కోసం ప్రయత్నిస్తున్నాం. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.